KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...






Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 | సంచిక 203 | బుధవారం 25 జూన్ 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-


## పోలవరం బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం లేదు..

: చంద్రబాబు



2 లో

## హైదరాబాద్‌లో మొదటిసారి బెట్టింగ్ యాప్ ప్రమోటర్స్ అరెస్ట్



2 లో

- రైతు భరోసా పేరుతో మోసం.. 511 మంది ఆత్మహత్యలపై హరీశ్ రావు మండిపాటు
- ఒక్క చెరువు నింపకుండా.. ఒక్క డ్యాం కట్టకుండా సంబరాలా?
- ఎన్నికల కోసం రైతులను మభ్యపెట్టొద్దు
- రైతు సంక్షేమం కాదు.. రైతు సంక్షోభమే ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం

: హరీశ్ రావు



2 లో

## విజయోత్సవాలు కాదు..

# రైతులకు క్షమాపణ చెప్పాలి : హరీశ్ రావు

స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతు భరోసా పేరిట ఆడుతున్న డ్రామాలు ఆపి, 19 నెలల కాలంలో రైతన్నను అరిగోస పెట్టుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు 15,000 చొప్పున ఇస్తామని చెప్పి 12,000కి పరిమితం చేయడం మోసం చేయడమే అని ధ్వజమెత్తారు.

గత వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టి, యాసంగిలో ఎగ్గొట్టి, ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం రైతులను మోసం చేయడమే అని మండిపడ్డారు. చెప్పింది కొండంత, చేసింది గోరంత. ఎన్నికల ప్రచారంలో రైతులను మభ్య పెట్టావు. అధికారంలోకి వచ్చాక నిండా ముంచావు. రైతులకు ఏం చేశావని సంబరాలు చేస్తున్నావ్ రేవంత్ రెడ్డి..? రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా? కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా? రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అని ఇవ్వకుండా మోసం చేసినందుకా? రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినందుకా? అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేసినందుకా? 1200 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించినందుకా? ప్రీమియం చెల్లించక రైతు బీమా అమలు ప్రశ్నార్థకం చేస్తున్నందుకా? పంట బీమా అని చెప్పి ఉసురుమనిపించినందుకా? దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినందుకా? లగచర్ల, రాజోలి రైతుల చేతులకు బేడీలు వేసినందుకా? ఏడాదిన్నర పాలనలో ఒక్క చెరువు నింపకుండా, ఒక్క చెక్ డ్యాం కట్టకుండా, కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వనందుకా?

## కవితకు సీపీఎం సంపూర్ణ మద్దతు..

జాన్‌వెస్లీతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ భేటీ



2 లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందే

: మీనాక్షి నటరాజన్



2 లో

పీఏసీ మీటింగ్ లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన సన్నాహాలను అడిగి తెలుసుకున్నారు తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్. ఉప ఎన్నికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందేనని ఆమె సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందర్నీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు బాధ్యతలు అప్పగించారు.






# కష్టపడితేనే పదవులు..

- పదవుల కోసం కాదు.. పార్టీ కోసం పనిచేయండి
- 2033 వరకు అధికారం మనదే..
- 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే
- కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ దేశానికి ఆదర్శం
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లకు సిద్ధంగా ఉండండి
- రెండోసారి అధికారంలోకి రావడం మీ చేతుల్లోనే- సీఎం రేవంత్ రెడ్డి

## మరో పదేళ్ల అధికారం మనదే: సీఎం రేవంత్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే కచ్చితంగా పదవులు వస్తాయని ఇప్పుడున్న చాలా మంది నేతలు కింది స్థాయి నుంచి వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే నా ఎదుగుదల సాధ్యమైందని పార్టీ బాధ్యత మోసిన వారికే ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉంటుందన్నారు. మంగళవారం గాంధీభవన్ లో పీఏసీ మీటింగ్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ నూతన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ రచించిన 'విధ్వంసం నుంచి వికాసం వైపు' పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఎంతో మంది పదవుల కోసం పోటీ పడ్డారన్నారు. మీరంతా పార్టీ నిర్మాణంలో కీలక భాగస్వామ్యం తీసుకోవాలన్నారు. మన ప్రభుత్వం అనేక సక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని, ఈ దేశంలో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. కార్యకర్తల ఎన్నికలు (స్థానిక సంస్థల ఎన్నికలు) రాబోతున్నాయి. మన కార్యకర్తలను కష్టపడి గెలిపించుకోవాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్తాయిలో పని చేయాల్సిందేనని పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలన్నారు. పార్టీ కోసం పని చేయనివాళ్లను ఎన్నికల ముందు బాధ్యతల నుంచి తప్పిస్తామని హెచ్చరించారు.

2 లో



## రాజకీయాలకతీతంగా బోనాలు చేసుకుందాం..

నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



2 లో

## ఎన్నికల్లో గెలిచే దమ్ము లేకే ఫోన్ ట్యాపింగ్..

- ఎన్నికల్లో గెలిచే ధైర్యం లేకే కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్
- నా కుటుంబం, గన్‌మెన్‌ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు
- కేసీఆర్ కోసం ఎస్ఐబీ మాజీ చీఫ్ నిబంధనలు అతిక్రమించాడు
- ఫోన్ ట్యాపింగ్ కేసు నత్తనడకన సాగుతోంది - ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్


ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ నేతలు ఈటల రాజేందర్, ప్రేమేందర్ రెడ్డి వాంగ్మూలాలను మంగళవారం సిట్ అధికారులు నమోదు చేశారు. 2023 నవంబర్ ఎన్నికల సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీరిద్దరి ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 4వేల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు కనుక్కున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈటల స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు.



2 లో

## నేటి మాట

ఆగ్రహం అనేది విషం తాగడం లాంటిది, అది మీ శత్రువులను కాదు మిమ్మల్ని చంపుతుంది



- నెల్సన్ మండేలా

# తల్లిని కడతేర్చిన కూతురు...

- ప్రేమను నిరాకరించినందుకు టెన్త్ విద్యార్థి దుశ్చర్య
- వారం క్రితం యువకుడితో వెళ్లిపోయిన నిందితురాలు
- మూడు రోజుల క్రితం వచ్చి తల్లి మర్డర్కు స్కెచ్
- ఇంట్లో పూజ చేస్తుండగా ప్రియుడితో కలిసి హత్య
- మృతురాలు చాకలి ఐలమ్మ మునిమనవరాలు బాలానగర్ పరిధిలోని జీడిమెట్లలో ఘటన





2 లో

## ట్రంప్ సీస్‌ఫైర్ విఫలం.. ఇజ్రాయెల్‌పై మళ్లీ ఇరాన్ క్షిపణి దాడులు..!

గత కొన్ని రోజులుగా ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న పరస్పర దాడులతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీంతో అంతా సద్దుమణుగుతుందని అందరూ భావించారు. ఈ ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇరాన్ తాత్కాలిక యుద్ధ విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఇజ్రాయెల్ ఆరోపించింది. సీస్‌ఫైర్ అమలులోకి వచ్చిన 2 గంటలకే ఇరాన్ నుంచి 2 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించారని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) ఓ ప్రకటనలో పేర్కొంది. దీనికి తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించింది.



2 లో

# కష్టపడితేనే పదవులు.. మరో పదేళ్లు అధికారం మనదే: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

పదేళ్లు నాదే బాధ్యత:

ఉమ్మడి రాష్ట్రంలో 1994 నుంచి 2004 వరకు టీడీపీ, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని సీఎం చెప్పారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలో ఉందని 2023 నుంచి 2033 వరకు పదేళ్లు కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలో ఉండబోతున్నదన్నారు. ఈ పదేళ్లు పార్టీ కోసం పని చేసే వారిని కాపాడుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. పదేళ్లు అధికారం నడిపించే వరకు నేను బాధ్యత తీసుకుంటా. ఆ తర్వాత పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి నడిపించాల్సిన బాధ్యత పార్టీలోని యువతరం తీసుకోవాలని చెప్పారు. రెండోసారి అధికారంలోకి రావడం కార్యకర్తల చేతుల్లో ఉందని, ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు అందుబాటులోకి తేవాలన్నారు. పార్టీ పదవులను చిన్నచూపు చూడవద్దని ఈ పార్టీ పదవులే మిమ్మల్నీ పెద్ద నాయకులుగా తీర్చిదిద్దుతుందన్నారు. కులగణన చేసి మోడీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతో పాటు కలగణన చేసే పరిస్థితి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. త్వరలో డీలిమిటేషన్ జరగబోతున్నదని సీట్లు పెరగబోతున్నాయన్నారు. మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయి. జమిలీ ఎన్నికలు తేస్తామని చెబుతున్నారని ఆ సమయానికి మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ 18 నెలలో గోల్డెన్ పీరియడ్ అని అన్నారు.

# పోలవరం బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం లేదు..: చంద్రబాబు

సచివాలయంలో మంగళవారం ఏపీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది .42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అజెండా అంశాల అనంతరం రాజకీయ అంశాలపై చర్చ జరిగింది. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై అనుమానాలు నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ఘనంగా తెలంగాణకు ఉన్న అన్ని అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నాం అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం లేదన్నారు. తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టిన అభ్యంతరం చెప్ప లేదు అన్నారు. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలు అంతా మాట్లాడాలన్నారు. కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారని అన్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉందన్నారు.

# రాజకీయాలకతీతంగా బోనాలు చేసుకుందాం.. పొన్నం పిలుపు

మొదటి పేజీ తరువాయి

దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసి పోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండు సార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని.. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3600 దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగిందని తెలిపారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట, లాల్ దర్వాజా ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. జోగిని వాళ్ళకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీ వస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని తెలిపారు. డెక్కన్ మానవ సేవ సమితి , ఇతర సంస్థలు ఇక్కడ చాలా సేవ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని, జిల్లా కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పాల్గొన్నారు.

# బీజేపీలో చేరికపై శశిథరూర్ స్పందన



కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. నిత్యం ఎన్డీఏ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తూ.. ప్రధాని మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. అంతేకాకుండా బీజేపీ ఎంపీలతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరగడంతో శశిథరూర్ పార్టీ మారడం ఖాయమని పొలిటికల్‌గా అందరూ ఫిక్స్ అయిపోయారు. ఎన్నో రోజులుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అంతేకాకుండా ఇటీవల కేంద్ర ప్రభుత్వం.. విదేశాలకు దౌత్య బృందాలను పంపించింది. ఆ బృందంలో ఒక కమిటీకి శశిథరూరే నాయకత్వం వహించారు. దీంతో పార్టీ మారడం ఖాయంగా వార్తలు వచ్చాయి. మంగళవారం ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు శశిథరూర్ స్పందించారు. తాజా పరిణామాలను బట్టి చూస్తే.. పార్టీ మారడం ఖాయమా? అని విలేకరి అడిగాడు. దానికి చిరునవ్వు చిందిస్తూ.. బీజేపీలో చేరడానికి అవేమీ సంకేతాలు కావని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ చొరవతో.. ఇతర దేశాలతో భారత్ సంబంధాలు మెరుగుపడ్డాయని.. అయితే ఇది బీజేపీనో, కాంగ్రెస్ తీసుకొచ్చిన విదేశాంగ విధానం కాదని.. ఇది భారతదేశ విదేశాంగ విధానం అని చెప్పుకొచ్చారు. సుమారు 11 ఏళ్ల కిందట పార్లమెంట్‌లో విదేశాంగ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఇదే విషయం చెప్పినట్లు గుర్తుచేశారు. అంత మాత్రాన బీజేపీలో చేరతానని కాదని.. ఇది జాతీయ సమైక్యతకు సంబంధించిన విషయంగా పేర్కొన్నారు. ఇక కాంగ్రెస్ అధిష్టానంతో విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని.. నాలుగు గోడల మధ్య చర్చించుకుంటే పరిష్కారం అవుతాయని తెలిపారు. తాను ఇప్పటికీ కాంగ్రెస్‌కు విధేయుడినేనని.. పార్టీకి అవసరమైతే పెద్ద పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందే: మీనాక్షి నటరాజన్

పీఏసీ మీటింగ్ లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన సన్నాహాలను అడిగి తెలుసుకున్నారు తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్. ఉప ఎన్నికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందేనని ఆమె సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందర్నీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు బాధ్యతలు అప్పగించారు.

జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ కు ఎవరిని నియమిస్తున్నారని అడిగిన ప్రశ్నకు.. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని సీఎం రేవంత్ చెప్పారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని ఆదేశించారు. పార్టీ నిర్ణయించి అభ్యర్థిని ప్రకటించే వరకు ఎవరూ కామెంట్స్ చేయొద్దని సూచించారు.

పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని హెచ్చరించారు సీఎం రేవంత్. ఈ సందర్భంగా తమ సేవలను ఉపయోగించుకోవాలని పలువురు సీనియర్లు తెలిపారు. అయితే పదవులు వచ్చిన వాళ్ళు రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు సీఎం.

పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ గా చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతుందని తెలిపారు. వీలైనంత త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహిద్దామని.. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు బాధ్యతలు మంత్రులు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు.

# విజయోత్సవాలు కాదు.. రైతులకు క్షమాపణ చెప్పాలి : హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి



ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరపనందుకా? జనుము, జీలుగు విత్తనాల ధరలు పెంచి, రైతులకు సకాలంలో అందించినందుకా? వరంగల్ రైతు డిక్లరేషన్ ను అటకెక్కించినందుకా? మీ దుర్మార్గ పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా? ఎందుకు సంబురాలు చేస్తున్నావు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రైతుల బతుకులు సంక్షోభంలో కూరుకుపోయాయి. బిఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్న రైతన్న నేడు ప్రభుత్వ పథకాలు అందక పంట పొలాల్లోనే కుప్ప కూలుతున్నడు. బీఆర్ఎస్ పార్టీది రైతు సంక్షేమ ప్రభుత్వం అయితే, కాంగ్రెస్ పార్టీది రైతు సంక్షోభ ప్రభుత్వం. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే, మీరు ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇచ్చి మభ్య పెట్టాలని చూస్తున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో చేస్తున్న నీ జిమ్మిక్కులను రైతులు నమ్మరు. రైతులను కన్నీళ్లు పెట్టించినందుకు, ఉసురు తీసుకున్నందుకు విజయోత్సవాలు కాదు క్షమాపణలు చెప్పండి. ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయండి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# కవితకు సీపీఎం సంపూర్ణ మద్ధతు.. జాన్‌వెస్లీతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ భేటీ



బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ఉద్యమానికి సీపీఎం సంపూర్ణ మద్ధతిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రకటించారు. ఇవాళ హైదరాబాద్‌లోని సీపీఎం స్టేట్ ఆఫీస్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన డిమాండ్ అని చెప్పారు. సామాజిక న్యాయం కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. రిజర్వేషన్లను పెంచి అసమానతలను తొలగించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని అన్నారు. బీజేపీ సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉంటుందని మండిపడ్డారు.

మొన్నటి వరకు కులగణనను కూడా బీజేపీ పార్టీ వ్యతిరేకించిందని, ప్రజా ఉద్యమాలకు తలొగ్గి కులగణన చేయడానికి ముందుకొచ్చిందని అన్నారు. రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర బీజేపీ నాయకులు నోరు విప్పడం లేదన్నారు. 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై ఒత్తిడి చేసే బాధ్యత బీజేపీ నాయకులపై కూడా ఉందన్నారు. కేవలం కేంద్రానికి వినతి పత్రాలు అందించే వరకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పరిమితం కావొద్దని సూచించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం- కవిత

ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం గత రెండేళ్లుగా ఉద్యమిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఆమోదించిందని, రాష్ట్రపతి ఆమోదానికి బిల్లు మూడు నెలల క్రితమే వెళ్లినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఢిల్లీకి వెళ్లడంలో హాఫ్ సెంచరీ చేసినా సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోడీతో ఈ అంశంపై మాట్లాడకపోవడం శోచనీయమని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలంటే ఉద్యమబాటనే మార్గం అని భావించారు.

జూలై 17న రైల్ వ్యవస్థను స్థంభించే విధంగా రైల్ రోకో చేపట్టబోతున్నామని చెప్పారు. కలిసివచ్చే భావసారుప్యతగల శక్తులన్నింటినీ మద్దతు కోసం కలుస్తున్నామని అన్నారు. ఉద్యమాలకు పేరెన్నికగల సీపీఎం పార్టీ నాయకులను కూడా కలిశామని చెప్పుకొచ్చారు. బిల్లు ఆలస్యమైతే బీసీలు ఉద్యోగులు, విద్యార్థులు రిజర్వేషన్లలో వాటాను కోల్పోతారని హెచ్చరించారు.

# ట్రంప్ సీస్‌ఫైర్ విఫలం.. ఇజ్రాయెల్‌పై మళ్లీ ఇరాన్ క్షిపణి దాడులు..!

మొదటి పేజీ తరువాయి



. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇరాన్‌పై గట్టిగా స్పందించాలని తాను ఐడీఎఫ్‌కు ఆదేశించానని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ పేర్కొన్నారు. టెహ్రాన్‌కు అతి ముఖ్యమైన ప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేయాలని పేర్కొన్నట్లు వెల్లడించారు. బీర్‌షెబాలో నివాస భవనాన్ని ఇరానియన్ క్షిపణి ఢీకొంది. ఇందులో నలుగురు మృతి చెందగా.. డజను మందికి గాయాలైనట్లు తెలుస్తోంది.

మరోవైపు.. ఇజ్రాయెల్ ఆరోపణలపై ఇరాన్ స్పందించింది. ఇజ్రాయెల్‌పై మిస్సైల్ దాడులను ఇరాన్ ఖండించింది. తాము సీస్‌ఫైర్ ఉల్లంఘించలేదని ప్రకటించింది. ఇరాన్ క్షిపణులు ప్రయోగించిందని ఇజ్రాయెల్ ఆరోపించడంతో ట్రంప్ సీస్‌ఫైర్ విఫలమైంది. ఇరాన్ క్షిపణుల దాడికి తక్షణమే ఇజ్రాయెల్ ప్రతిస్పందించింది. దీంతో మిడిల్ ఈస్ట్ పరిణామాలు మళ్లీ ఉద్రిక్తతకు దారితీశాయి. ట్రంప్ మధ్యవర్తిత్వంతో వచ్చిన సీస్‌ఫైర్ 24 గంటలు కూడా నిలబడలేదు. ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ ముదిరే అవకాశాలు ఉన్నాయి. యుద్ధ విరమణ ఒప్పందం కూలిపోయిన నేపథ్యంలో ప్రపంచం ఉత్కంఠ నెలకొంది.

# తల్లిని కడతేర్చిన కూతురు..

నవమాసాలు మోసి కనిపెంచిన తల్లినే కడతేర్చింది ఓ బాలిక.. కన్న పేగు తెంచుకుని పుట్టిన బిడ్డ.. తల్లి ప్రేమను మరిచిది. 18 ఏళ్లు నిండక ముందే ప్రియుడితో కలిసి తల్లి పాలిట యమపాశం గా మారింది. జీడిమెట్ల పరిధిలో ఈ దారుణ ఘటన జరిగింది. ప్రియుడితో కలిసి కన్నతల్లిని కూతురు హత్య చేసింది. ప్రేమ వ్యవహారంలో మందలించిందన్న కోపంతో తన ప్రియుడు శివ(19), అతని తమ్ముడు యశ్వంత్(18)తో కలిసి కూతురు తేజశ్రీ(16) కన్నతల్లిపై కిరాతకానికి పాల్పడింది.

కేసు నమోదు చేసిన జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలు అంజలి చాకలి ఐలమ్మ ముని మనవరాలు. మహబూబాబాద్ చెందిన అంజలి 20 ఏళ్లుగా జీడీమెట్లలో నివాసం ఉంటున్నారు. ఆమె మహిళా మండలిలో కూడా పనిచేస్తోంది. కాగా, ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని నెలల క్రితమే బాలికకు ఇన్‌స్టాలో శివ పరిచయమయ్యాడు. పదో తరగతికే ప్రేమ ఏంటని తల్లి అంజలి మందలించింది. వారం క్రితం శివతో ఆ బాలిక వెళ్లిపోయింది. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం బాలిక ఇంటికి తిరిగి వచ్చింది.

తల్లి అడ్డు తొలగించునేందుకు ప్రియుడితో కలిసి స్కెచ్ వేసింది. సోమవారం సాయంత్రం నల్లగొండ నుంచి ప్రియుడు శివను రప్పించింది. ఇంట్లో అంజలి పూజ చేస్తుండగా వెనుక నుంచి దాడి చేశాడు. బెడ్‌షీట్‌తో అంజలి ముఖాన్ని శివ కప్పగా.. సుత్తితో తల్లి అంజలిపై కూతురు దాడి చేసింది. శివ తమ్ముడు యశ్వంత్ కూడా కత్తితో పీక కోశాడు. తల్లి హత్య తర్వాత కుర్చీలో నుంచి పడిపోయిందని అందరిని నమ్మించే ప్రయత్నం చేసింది. ఆ బాలిక.. తన పెద్దమ్మకు ఫోన్ చేసి అమ్మ కుర్చీ నుంచి పడిపోయిందని.. గాయాలయ్యాయంటూ చెప్పుకొచ్చింది. తన తల్లి మృతిపై బాలిక తేజశ్రీ చెల్లెలు కన్నీరుమున్నీరైంది. బయటకెళ్లి వచ్చేసరికి అమ్మ రక్తపు మడుగుల్లో ఉందని పేర్కొంది. పోలీసులకు ఫోన్ చేసి.. అమ్మను ఆసుపత్రికి తీసుకెళ్దామని చెప్పినా కూడా అక్క వినలేదని పేర్కొంది.

# ఎన్నికల్లో గెలిచే దమ్ము లేకే ఫోన్ ట్యాపింగ్..

మొదటి పేజీ తరువాయి

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ నేతలు ఈటల రాజేందర్, ప్రేమేందర్ రెడ్డి వాంగ్మూలాలను మంగళవారం సిట్ అధికారులు నమోదు చేశారు. 2023 నవంబర్ ఎన్నికల సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీరిద్దరి ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 4వేల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు కనుక్కున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈటల స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి బాధితుడిని తనేనంటూ ఈటల ఆరోపించారు. తన కుటుంబ సభ్యులు, డ్రైవర్లు, గన్‌మెన్‌లు ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపణలు చేశారు. హుజురాబాద్ ఉప ఎన్నికతో పాటు అంతకుముందు, తర్వాత కూడా ఫోన్ ట్యాపింగ్‌కి గురైనట్లు సిట్ గుర్తించింది. అలాగే.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సిట్ అధికారులకి ఫిర్యాదు చేశారు. 2020 నుంచి 2024 వరకు తన ఫోన్ సంభాషణలను రహస్యంగా తెలుసుకున్నారని ఫిర్యాదులో మాధవరం కృష్ణారావు తెలిపారు. కుట్ర పూరితంగా కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాప్ చేసినట్లు సిట్‌కి తెలంగాణ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెజండ్ల కిషోర్ బాబు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలను సిట్ అధికారులకి కిషోర్ బాబు ఇచ్చారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు నత్తనడకన నడుస్తోంది: ఎంపీ ఈటల రాజేందర్

ఫోన్ ట్యాపింగ్ కేసు నత్తనడకన నడుస్తోందని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అధికారులందరూ కేసీఆర్‌కు తొత్తులుగా వ్యవహరించారని ఆరోపించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నిబంధనలు అతిక్రమించి కేసీఆర్ కోసం పనిచేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని రంగాల్లోని ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ హక్కును ఆటంకం కలిగించే హక్కు ఎవరికీ లేదని అన్నారు. సంఘవిద్రోహ శక్తులవి కాకుండా నాయకులు ఫోన్లను కేసీఆర్ ప్రభుత్వం ట్యాపింగ్ చేయడం దారుణమని ధ్వజమెత్తారు ఎంపీ ఈటల రాజేందర్.

తనతో పాటు తన కుటుంబ సభ్యులు, అనుచరుల ఫోన్లు ట్యాపింగ్ చేయడం దారుణమని ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్ అయ్యారు. హుజురాబాద్ ఎన్నికల్లో తన ఫోన్ ట్యాపింగ్‌కి గురైందని ఆరోపించారు. తాను ఎవరితో మాట్లాడినా తన మాటలను విని తన వారిని బెదిరించేవారని చెప్పుకొచ్చారు. తమ నాయకులకు సంబంధించిన అన్ని సంభాషణలు కూడా వినేవారని అన్నారు. మునుగోడు బై ఎలక్షన్‌లో ఎక్కడ ఉంటున్నాం.. ఎవరితో మాట్లాడుతున్నాం, బీజేపీ ప్రణాళికలను కూడా పూర్తిగా వినేవారని తెలిపారు. ఎన్నికల్లో గెలిచే దమ్ములేకే కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసిందని ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరంపై రేవంత్ ప్రభుత్వం విచారణ కమిటీ వేసింది కానీ దర్యాప్తు వేగంగా జరగడం లేదని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో మొదటిసారి బెట్టింగ్ యాప్ ప్రమోటర్స్ అరెస్ట్

హైదరాబాద్‌లో ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ ప్రమోటర్స్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తెలుగు రాష్ట్రాల యువతే టార్గెట్‌గా టెలిగ్రామ్‌లో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్నారు. కాగా ఓ వ్యక్తి ఆన్ లైన్‌లో రూ. 50 లక్షలు పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు విచారణ జరపగా నలుగురు పట్టుబడ్డారు. నింధితుల్లో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ఉన్నారు. దీనికి సంబంధించిన వివరాలను డీజీపీ సాయిశ్రీ మీడియాకు వివరించారు.

మనీలాండరింగ్ కోణంలోనూ విచారిస్తున్నట్టు తెలిపారు. బేస్ లెస్ ప్రెడిక్షన్ చేస్తూ ప్రమోటర్లు యూజర్లను మోసం చేస్తున్నారని చెప్పారు. మాయ మాటలతో బెట్టింగ్ రాయుళ్లను రెచ్చగొడుతూ డబ్బులు పెట్టేలా ప్రేరేపిస్తున్నట్టు తెలిపారు. బెట్టింగ్ అనేది ఇల్లీగల్ అని ప్రెడిక్షన్స్ ఇవ్వడం కూడా నేరమే అని స్పష్టం చేశారు. గ్రౌండ్ రియాలిటీకి వాళ్లు చెప్పేదానికి సంబంధం ఉండదని అన్నారు. తెలంగాణలో మొదటి సారి బెట్టింగ్ ప్రమోటర్లను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.



# సంక్షేమ కార్యక్రమాలకు రూ.95,351 కోట్లు ఖర్చు: భట్టి విక్రమార్క

రాష్ట్రంలో రూ. 22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. "రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. రూ. 6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని చెప్పారు.

# చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన

## -డా.గాదరి కిశోర్ కుమార్



మోత్కూర్ ,24జూన్ (క్రాంతి న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముషిపట్ల గ్రామంలో బీఆర్ఎస్ నాయకురాలు భుశిపాక బుచ్చమ్మ మరియు బాసోజు సుగుణమ్మ ఇటీవల మరణించడంతో మంగళవారం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం అనాజీపురం గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు చుక్క బిక్షపతి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ , మండల పార్టీ అధ్యక్షులు పోనెబోయిన రమేష్ పట్టణ పార్టీ అధ్యక్షులు



జంగ శ్రీను మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్ర నాథ్ జిల్లా నాయకులు పైళ్ల దయాకర్ రెడ్డి కొండ సోమంల్లు దాసరి తిరుమలేష్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శిగజ్జి మల్లేష్ మాజీ ఎంపీటీసీ పానుగుల్ల విష్ణుమూర్తి గ్రామ శాఖ అధ్యక్షులు నేర్లకంటి మచ్చ గిరి వ ల్లందాస్ వెంకటయ్య మాజీ సర్పంచ్ ఉప్పల యాదయ్య సోషల్ మీడియా కోఆర్డినేటర్ పోన్నెబోయిన మచ్చగిరి బశిపాక గణేష్ నేర్లకంటి శీను కల్లు శంకరయ్య కుమ్మరి కుంట్ల శేఖర్ రెడ్డి చుక్క కిష్టయ్య బర్రె శంకరయ్య మరి కుప్పల శంకరయ్య చేగూరి వెంకన్న నిమ్మల సత్యనారాయణ చుక్క గంగయ్య మలి పెద్ద నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదల్లందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

**● కుంటిసాకులతో కార్డులు తొలగించే చర్యలు చేపట్టొద్దు ● గుండు వెంకటనర్సు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి**



మోత్కూర్,24 జూన్ (క్రాంతి న్యూస్):రేషన్ కార్డు దరఖాస్తుల విచారణ త్వరగా పూర్తిచేసి అర్హులైన పేదలందరికి తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ.కొత్త రేషన్ కార్డుల కోసం పది సంవత్సరాలుగా ప్రజలు ఎదిరిచుస్తున్నారని, ఇప్పటికే రేషన్ కార్డుల కోసం ప్రజా పాలన, మీ సేవా కేంద్రాలలో దరఖాస్తులు పెట్టుకున్నారని అర్హులైన పేదలందరికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రేషన్ కార్డుల విషయంలో ప్రజలకు చాల అన్యాయం చేసిందని అదిగో ఇదిగో అంటూ పదేండ్లు కాలం గడిపిందని విమర్శించ్చారు. ప్రస్తుతం కుంటి సాకులతో కార్డులు తొలగించే చర్యలు చేపట్టవద్దని, కాలయాపనతో గత ప్రభుత్వ విదనాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.కొత్తగా పెండ్లిఅయినవారు, పిల్లల పేర్లు నమోదు చేసుకోవలసిన వారు, రేషన్ కార్డులు లేని కుటుంబాలు లక్షల సంఖ్యల్లో ఉన్నాయని అన్నారు. రేషన్ కార్డులో ఉన్న పేరు తోలగించుకుంటేనే కొత్త అప్లికేషన్ తీసుకుంటామన్నా నిబంధన చాల ఇబ్బందులకు గురించేస్తుందని అన్నారు. ఆరోగ్య శ్రీ తోపాటు ప్రభుత్వ పథకాలన్నిటికీ రేషన్ కార్డు పరిగణలోకి తీసుకుంటున్నారని అందువల్ల పాత రేషన్ కార్డులో పేరు కట్ అయిన వెంటనే కొత్త కార్డులో నమోదు చెయ్యాలని అన్నారు. ప్రజా పంపిణి వ్యవస్థను బలోపేతం చేసి పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల నేపథ్యంలో కేరళ తమిళనాడు రాష్ట్రలలో ఇస్తున్న విధంగా ప్రతి రేషన్ కార్డుపైన 14 రకాల వస్తువులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, దడిపల్లి సైదులు ఉన్నారు.

## ఐదుసార్లు తప్పించుకున్న తేజేశ్వర్.. ఆరోసారి బలయ్యాడు.. సంచలన విషయాలు వెలుగులోకి



జోగులాంబ గద్వాల, 24 జూన్ (క్రాంతి న్యూస్):జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న తేజేశ్వర్ హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ప్రేమ పేరుతో మోసపోయిన తేజేశ్వర్‌ను కిరాతకంగా హత్య చేసిన ఘటనలో విచారణ చేపట్టిన పోలీసులు షాకింగ్ విషయాలను బయటపెడుతున్నారు. తేజేశ్వర్ స్థానికంగా ప్రైవేట్ సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలం క్రితమే ఐశ్వర్య అనే యువతిని ప్రేమించి, పెద్దల వ్యతిరేకతను ఎదుర్కొంటూ పెళ్లి చేసుకున్నాడు. అయితే పెళ్లికి ముందే ఐశ్వర్యకు ఓ వివాహితుడు అయిన బ్యాంకు మేనేజర్ తిరుమలరావుతో ప్రేమ సంబంధం ఉంది. తన భార్యకు పిల్లలు లేనని చెప్పి, ఐశ్వర్యను రెండో భార్యగా తీసుకునేందుకు ఆమెతో చీకటి బంధాన్ని కొనసాగించాడు.

ఇదే సమయంలో ఐశ్వర్య.. తేజేశ్వర్ నిశ్చితార్థం కూడా తాత్కాలికంగా రద్దవ్వగా, తర్వాత మాయ మాటలతో తేజేశ్వర్‌ను ఒప్పించి పెళ్లి చేసుకుంది. పెళ్లి తర్వాత కూడా బ్యాంకు మేనేజర్‌తో సంబంధాన్ని కొనసాగిస్తూ.. తేజేశ్వర్ అడ్డు తొలగించాలనే కుట్రకు దిగింది. ఈ క్రమంలో ఐశ్వర్య తేజేశ్వర్ బైక్‌కు సీక్రెట్‌గా జీపీఎస్ ట్రాకర్ అమర్చింది. అతని ప్రతి కదలికను తెలుసుకుంటూ, డేటాను బ్యాంకు మేనేజర్‌కు చేరవేసింది. రూ.75,000 సుపారీకి హత్యకు ప్లాన్ రూపొందించి, ఓ గ్యాంగును రంగంలోకి దింపింది.

ఈ కుట్ర మొత్తం ఐదుసార్లు విఫలమవగా, ఆరోసారి తేజేశ్వర్ హంతకుల చేతిలో చిక్కి ప్రాణాలు కోల్పోయాడు. సర్వే పనిమీద అని చెప్పి తేజేశ్వర్‌ను ఓ కారు ద్వారా పిలిపించి, కారులోనే అతని గొంతు కోసి హత్య చేశారు. మృతదేహాన్ని తాళ్లతో కట్టిపెట్టి, ఓ కవర్‌లో నంద్యాల జిల్లా పాణ్యం మండలం సమీపంలోని గాలేరి నగర కాల్వలో వదిలేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసును దర్యాప్తు చేయగా అసలు కుట్ర వెలుగులోకి వచ్చింది. తేజేశ్వర్ హత్యకేసులో ఐశ్వర్య, ఆమె తల్లి సుజాత, హంతకుడు మనోజ్, క్యాబ్ డ్రైవర్, మధ్యవర్తితో పాటు మొత్తం 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నారు.

# కాంగ్రెస్ రైతు పండగ సంబరాలు ఎందుకోసం?



హైదరాబాద్, 24 జూన్ (క్రాంతి న్యూస్): కాంగ్రెస్ రైతు పండుగ సంబురాలపై మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ రైతు పండగ సంబరాలు ఎందుకోసం? రైతు భరోసా నాలుగు విడతలు ఎగ్గొట్టినందుకా? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ కంటే ఎక్కువ ఇస్తాం.. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.12 వేలకు కుదించి.. అది కూడా ఇవ్వనందుకా? అని నిలదీశారు.

రూ.2 లక్షలు రుణమాఫీ అని చెప్పి అరకొర చేసి ఎగ్గొట్టినందుకా? ఏ కారణం చేత రైతు మరణించినా ఆ కుటుంబానికి ధీమాగా ఉండాలని రూ.5 లక్షల సాయం అందించే రైతుబీమా రాకుండా చేసినందుకా? ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో దాదాపు 550 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా? వానాకాలం పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ బకాయిలు ఎగ్గొట్టినందుకా? యాసంగి పంటకు క్వింటాలుకు రూ.500 అసలు బోనస్ ఇవ్వనందుకా? కల్లాలకు వచ్చిన ధాన్యం నెలల తరబడి కొనకుండా కండ్ల ముందు అకాల వర్షాల పాలయ్యేలా చేసి కన్నీళ్లు పెట్టించినందుకా? కల్లాల్లో ధాన్యం ఉండగానే వాటిని కొనకుండా కొనుగోలు కేంద్రాలు ఎత్తేసినందుకా? పదేళ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసం నింపుకుని ఆత్మస్థైర్యంతో ఉన్న రైతులను కేవలం 18 నెలల పాలనతో నిండా ముంచి, వ్యవసాయం నడ్డి విరిచినందుకా? అని ప్రశ్నించారు.

లగచర్ల రైతులను జైలుకు పంపినందుకా? పెద్ద ధన్వాడ రైతులకు బేడీలు వేసినందుకా? ఐదు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో కేసీఆర్ లాగా ఒక్క పథకం అయినా ప్రవేశపెట్టారా? కోటి 50 లక్షల ఎకరాలకు నాలుగు విడతల్లో ఎకరాకు రూ.30 వేల చొప్పున ఈ ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టింది. నాలుగు విడతలుగా ఎగ్గొట్టిన రైతు భరోసా స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారు అన్న భయంతో అయినా రైతు భరోసా వేస్తున్నారని.. సచ్చినోని పెళ్లికి వచ్చిందే కట్నం అని రైతులు సరిపెట్టుకుంటున్నారు తప్ప సంబరాలు చేసుకోవడం లేదు. నాలుగు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండగ పేరుతో సంబరాలు చేయాలి అనడాన్ని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

# అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదు



కుత్బుల్లాపూర్ , 24 జూన్ (క్రాంతి న్యూస్):కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో అధికారులు ప్రొటోకాల్‌కు తిలోదకాలు ఇస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. ప్రజాప్రతినిధులను ప్రక్కన పెట్టి అధికార పార్టీకి చెందిన నాయకుల సహకారంతో ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సోమవారం జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్, నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి ప్రాంతాల్లో కేవలం పార్టీ పదవులతో అధికారులను మచ్చిక చేసుకుంటూ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో అధికారులు ప్రొటోకాల్ పాటించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, ఈశ్వర్‌రెడ్డి, చందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే అధికారితో ప్రజావాణి నిర్వహణ

నిజాంపేట్ కార్పొరేషన్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ఉన్నతాధికారులు లేకుండా కేవలం ఒక వార్డు ఆఫీసర్‌తో కార్యక్రమం నిర్వహించారు. దీనిపై ఆకుల సతీష్ మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్, అధికారుల సమక్షంలో ఫిర్యాదులు తీసుకొని పరిష్కరించే విధంగా నిబంధనలు ఉన్నాయని, అయితే కమిషనర్ నిర్లక్ష్యం కారణంగా ఒక వార్డు అధికారితో ప్రజావాణి నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు.దీనిపై కమిషనర్ జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆర్యజనని ఆధ్వర్యంలో స్కాలర్ షిప్ ఇచ్చేందుకు ఆన్ లైన్ టెస్ట్..





హైదరాబాద్, 24 జూన్ (క్రాంతి న్యూస్): సంతానం కోరుకునే దంపతులకు రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మార్గనిర్దేశం చేస్తున్న ఆర్య జనని యువతకు స్కాలర్ షిప్పులు అందించేందుకు మరోసారి ముందుకు వచ్చింది. ఇందుకోసం18 నుంచి 30 సంవత్సరాల లోపు యువతీ యువకులకు జాతీయస్థాయి ఆన్ లైన్ స్కాలర్షిప్ టెస్ట్ నిర్వహించనుంది.

స్వామి వివేకానంద ప్రాక్టికల్ వేదాంత, జ్ఞాన యోగ ప్రసంగాల ఆధారంగా రూపొందించిన నాలెడ్జ్ ట్రైంత్ అనే పుస్తకంపై టెస్ట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి మాక్ టెస్ట్ జూలై 20న జరగనుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆర్యజనని వెబ్సైట్ https://aaryajananicontests.org/ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు డాక్టర్ అనుపమ రెడ్డి తెలిపారు.

https://aaryajananicontests.org/login/signup.php. లాగిన్ కావాలి.మెయిన్ క్విజ్ ఆగస్టు మూడున జరగనుంది. విజేతలైన 150 మంది యువతీ యువకులకు ఆకర్షణీయ స్కాలర్షిప్పులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8977863881 నెంబర్ కు వాట్సాప్ చేయాలని సూచించారు.

హైదరాబాద్ రామకృష్ణ మఠం లోని వివేకానంద హెల్త్ సెంటర్‌లో సేవలందిస్తున్న ప్రత్యేక వైద్యుల బృందం 2018 సంవత్సరంలో ఆర్యజనని ప్రారంభించింది. అనేక మంది ఉత్సాహవంతులైన, సేవాభావతత్పరులైన వైద్యులు, యోగా నిపుణులు, క్లినికల్ సైకాలజిస్టులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, గాయకులు ఆర్యజనని బృందంలో ఉన్నారు.

ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఐదు సంవత్సరాలుగా, ఆర్యజనని సంస్థ, కాబోయే తల్లి తండ్రులకు ..స్పృహతో కూడిన గర్భధారణ, పేరెంటింగ్.... గురించి అవగాహన కల్పించే విధంగా ఆఫ్ లైన్... ఆన్ లైన్ వర్క్ షాప్ లు నిర్వహిస్తోంది.

ఇది గర్భిణీ స్త్రీలు, వారి శిశువుల శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. యోగా, ధ్యానం, బేబీ బాండింగ్ టెక్నిక్స్, ఆత్మీయ గానం, ప్రెగ్నెన్సీ లైఫ్ స్టైల్ తదితర అంశాలతో పాటు మూడు గంటల వర్క్ షాప్ లో ఆధ్యాత్మికత, ఆధునిక విజ్ఞానంతో కూడిన అద్భుతమైన మేళవింపు లాంటి విషయాలను తెలియజేస్తారు. కడుపులో పెరుగుతున్న శిశువు ఆరోగ్యం.. శారీరక... భావోద్వేగ.... మేధోపరమైన, ఆధ్యాత్మిక ఉన్నతికి ఈ వర్క్ షాప్ ఎంతో ఉపయోగపడుతుంది.

## చెన్నై నుంచి పోటీ చేసే దమ్ముందా?.. పవన్ కళ్యాణ్‌కు తమిళనాడు మంత్రి సవాల్.



తమిళనాడు ,24 జూన్ (క్రాంతి న్యూస్): డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు గట్టి సవాల్ విసిరారు తమిళనాడు మంత్రి శేఖర్‌బాబు. 2026 ఎన్నికల్లో చెన్నై నుంచి పోటీ చేసే దమ్ముందా అని ఆయన పవన్‌ను ప్రశ్నించారు. “చెన్నైలోని ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేయండి. తమిళనాడు ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ గెలిచి చూపించాలి. గెలిచిన తర్వాత మీరు ఎన్ని చెప్పినా వినడానికి సిద్ధం” అని మంత్రి శేఖర్‌బాబు అన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల తమిళనాడు పర్యటనకి వెళ్లిన పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌ను ఉద్దేశించి విమర్శలు గుప్పించాడు. తమిళనాడులో డిఎంకె ప్రభుత్వం అరాచకాలను ప్రోత్సహిస్తోందని పవన్ ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలకు కౌంటర్‌గా శేఖర్‌బాబు స్పందిస్తూ ఈ సవాల్ చేశారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మరో కేసు.. పిలిచినప్పుడు పీఎస్‌కు రావాలని..!



గుంటూరు , 24 జూన్ (క్రాంతి న్యూస్):వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మరో కేసు నమోదైంది. జగన్ గుంటూరు మిర్చి యార్డు పర్యటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిబ్రవరి 19న ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా.. మిర్చి యార్డులో పర్యటించారని కేసు నమోదు చేశారు. వైఎస్ జగన్‌తో పాటు వైసీపీ నేతలు అంబటి రాంబాబు, కావటి మనోహర్ నాయుడు, లేళ్ల అప్పిరెడ్డి, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి తదితరులపై కేసు నమోదైంది.

గత ఫిబ్రవరి 19న మిర్చి రైతులను పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ గుంటూరు యార్డుకు వచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. వైసీపీ నేతలు అనుమతి లేకుండా యార్డుకు వెళ్లారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నడిచే యార్డులో వైఎస్ జగన్ రాజకీయ ప్రసంగాలు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా జగన్‌తో పాటు అక్కడికి వెళ్లిన నేతలపై కేసు నమోదైంది. నేతలందరికీ పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. పిలిచినప్పుడు నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు విచారణకు రావాలని నోటీసులలో పేర్కొన్నారు. ఇటీవలి పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో చీలి సింగయ్య అనే వ్యక్తి మృతిపై ఇప్పటికే జగన్‌పై కేసు నమోదయింది.

## నక్కపల్లిలో భారీగా గంజాయి పట్టివేత



నక్కపల్లి, 24 జూన్ (క్రాంతి న్యూస్): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో జాతీయ రహదారిపై వెదుళ్లపాలెం వద్ద పోలీసులు మంగళవారం పెద్దఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీకి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు కార్లలో అనకాపల్లి నుంచి 369 కేజీల గంజాయితో ఢిల్లీకి బయలుదేరారు. విశ్వసనీయ సమాచారంతో సీఐ కె.కుమారస్వామి, ఎస్సై సన్నిబాబు సిబ్బందితో జాతీయ రహదారిపై వాహన తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో అనుమానాస్పదంగా ఉన్న రెండు కార్లను ఆపేందుకు ప్రయత్నించగా వారు తప్పించుకునే క్రమంలో ఇతర వాహనాలను ఢీకొట్టి ఆగిపోయారు. డ్రైవర్ పరారీ కాగా, మరొకరు పట్టుబడ్డాడు. కార్లతో పాటు గంజాయి స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

## యూపీఐ పేమెంట్స్‌తో లడ్డూ టోకెన్లు.. తిరుమలలో కియాస్క్‌ల ఏర్పాటు




తిరుపతి, 24 జూన్ (క్రాంతి న్యూస్):తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల సౌకర్యం కోసం లడ్డూ కౌంటర్ల వద్ద సెల్ఫ్ సర్వీస్ కియాస్క్‌ల ను ఏర్పాటు చేసింది. టచ్ స్క్రీన్ ఉండే ఆ మెషీన్ వద్ద.. ఒకవేళ అదనపు లడ్డూలు కావలంటే భక్తులు టోకెన్లు తీసుకోవచ్చు. యూపీఐ పేమెంట్ ద్వారా లడ్డూ టోకెన్లు జారీ చేస్తున్నది. దీంతో లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. తిరుమలలో ఉన్న వేర్వేరు లడ్డూ కౌంటర్ల వద్ద ఈ కొత్త తరహా కియాస్క్ మెషీన్లను ఏర్పాటు చేసినట్లు టీటీడీ పేర్కొన్నది. పేమెంట్ సక్సెస్ అయిన తర్వాత భక్తులకు రిసీట్ వస్తుందని, ఆ రిసీట్ ద్వారా అదనపు లడ్డూలను కౌంటర్ వద్ద తీసుకోవచ్చు అని, భారీ క్యూలైన్ల నుంచి ఉపశమనం పొందవచ్చు అని టీటీడీ తన ప్రకటనలో తెలిపింది.

భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు టీటీడీ డిజిటల్ సేవల్ని అందుబాటులోకి తీసుకు వస్తున్నది. చాలా సమర్థవంతమైన విధానాలను అమలు చేస్తున్నది. భక్తుల సౌకర్యార్థం కొత్త తరహా టెక్నాలజీ కియాస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు టీటీడీ పేర్కొన్నది. తిరుమలలోని ప్రతి టచ్ పాయింట్‌లో భక్తులను సంతృప్తిపరచాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు టీటీడీ చెప్పింది. దశలవారీగా అనేక చోట్ల కియాస్క్‌లను ఏర్పాటు చేయనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. తొలిసారి కియాస్క్‌లకు వాడే వారి కోసం, వృద్ధుల కోసం ప్రత్యేక స్టాఫ్‌ను నియమించారు. ఇలాంటి డిజిటల్ సేవల్ని మరింత విస్తరించాలని టీటీడీ భావిస్తున్నది. దీనిలో భాగంగా అకామిడేషన్, ప్రసాదం కౌంటర్ల వద్ద టచ్ స్క్రీన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నది.

## పిల్లలతో కలిసి బావిలో దూకిన తల్లి.. ఇద్దరు మృతి



విశాఖపట్నం, 24 జూన్ (క్రాంతి న్యూస్):భార్యాభర్తల మధ్య జరిగిన వివాదంలో భార్య తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో తన ఇద్దరి పిల్లలతో సహా ఆమె బావిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. విశాఖపట్నం జిల్లా పెందుర్తిలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు మరణించారు. బావిలో మెట్లు పట్టుకుని కుమార్తె ఉంది. దీంతో స్థానికులు వెంటనే బాలికను రక్షించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బావిలో నుంచి మృతదేహాలను వెలికి తీశారు.

అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అయితే గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని తమ దర్యాప్తులో తెలినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కారణంగానే ఆమె విసిగిపోయి.. ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిందని పోలీసులు వివరించారు. ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పేరిట నగదును ఖాతాలో వేసింది. ఈ ఖాతాలోని నగదును తన ఖాతాలోకి మళ్లించాలంటూ భార్యపై భర్త తీవ్ర ఒత్తిడి చేశాడు. అందుకు ఆమె అభ్యంతరం వ్యక్తం చేసింది.

ఆ క్రమంలో ఇరువురి మధ్య ఇప్పటికే పలుమార్లు ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. గత అర్ధరాత్రి 3.00 గంటల సమయంలో సైతం వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో తన పిల్లలతో కలిసి ఆమె బావిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. అయితే ఈ ఘటనలో తల్లి, కుమారుడు మరణించడంతో స్థానికంగా విషాదం నెలకొంది. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండోరోజు పోలవరం నిర్వాసితుల నిరసన దీక్ష..



అల్లూరి సీతారామరాజు జిల్లా , 24 జూన్ (క్రాంతి న్యూస్):అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం కొండమదులు పంచాయతీలోని గ్రామాలలోని పోలవరం నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. రెండోవ రోజు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తమతో 2017 సంవత్సరంలో కుదుర్చుకొన్న ఎంఓయు ప్రకారం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

గ్రామాలు ఖాళీ చేసేనాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్&ఆర్ అందించాలని కోరుతున్నారు. విలీన మండలాలతో సహా నిర్వాసితులందరికీ పూర్తి పునరావాసం కల్పించాలని, డి పట్టా సాగు చేస్తున్న ఆదివాసులకు పూర్తి నష్టపరిహారం అందజేయాలని నినాదాలు చేశారు. నేషనల్ పార్క్ పేరుతో ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించరాదని డిమాండ్ చేస్తున్నారు. నిర్వాసితుల అనుభవంలో ఉన్న కొండపోళ్ళు, విఎస్ఎస్‌లకు నష్ట పరిహారాలు అందించాలని కోరుతున్నారు. ఆదివాసుల జీవించే హక్కు, నివసించే హక్కులకు ఎలాంటి భంగం కలగరాదని.. కొండమొదలు పెద్దలతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని నినాదాలు చేస్తున్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదివాసీలు కోరుతున్నారు.

## వచ్చే 40 ఏళ్ల అవసరాలకు తగ్గట్టు దుర్గగుడి అభివృద్ధి!



అమరావతి, 24 జూన్ (క్రాంతి న్యూస్):విజయవాడ కనక దుర్గమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రెడీ చేయడం జరిగిందని, వచ్చే 40 సంవత్సరాల అవసరాలకు తగ్గట్టు దుర్గగుడి అభివృద్ధి పనులు చేపడుతాం అని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. కృష్ణా పుష్కరాల నిర్వహణకు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నామని చెప్పారు. విజయవాడ ఎయిర్‌పోర్ట్‌లో 70 శాతం పనులు పూర్తయ్యేలా చేశాం అని.. రాబోవు రోజుల్లో వారణాసి, అలహాబాద్‌కి ఫ్లైట్ కనెక్టివిటీ చేస్తున్నాం అని పేర్కొన్నారు. విజయవాడకు అతిముఖ్యమైన రైల్వే లైన్స్‌కి 1500 కోట్లతో టెండర్లను ఆహ్వానించాం అని ఎంపీ కేశినేని చిన్ని చెప్పుకొచ్చారు.

ఏడాదిలో విజయవాడలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పుస్తకాన్ని ఎంపీ కేశినేని చిన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ%ో% ‘సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతంగా పూర్తి చేసుకున్నాం. పార్లమెంట్ మెంబర్‌గా కూర్చో బెట్టిన సీఎం చంద్రబాబు, మా యువ కెరటం నారా లోకేష్ గార్లకు ధన్యవాదాలు. ఈ సంవత్సర కాలంలో నా తోడున్న మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ సంవత్సర కాలంలో సమస్యల మీద దృష్టిపెట్టాం. విజయవాడకు అతిముఖ్యమైన రైల్వే లైన్స్‌కి 1500 కోట్లతో టెండర్లు పిలిచాం. మధుర నగర్ ఆర్వోబీ, న్యూ రాజరాజేశ్వరి పేట ఆర్వోబీ వెస్ట్ ఈస్ట్ కలిపే వంతెనల డీపీఆర్ రెడీ చేశాం. మహానాడు రోడ్ నుండి రామవరప్పాడు రింగ్ వరకు ఫ్లై ఓవర్ శాంక్షన్ చేయడం జరిగింది’ అని తెలిపారు.

‘నేషనల్ హైవేను గొల్లపూడి వరకు 6 లైన్స్ చేయడం జరిగింది. ఆటోనగర్‌కు ఉన్న అన్ని ప్రత్యామ్నాయ దారులను 100 కోట్లతో అభివృద్ధి చేయడం జరుగుతుంది. కనకదుర్గ గుడి మాస్టర్ ప్లాన్ రెడీ చేశాం. రాబోయే 40 సంవత్సరాల అవసరాలకు తగ్గట్టు దుర్గ గుడిని అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఆటో నగర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసు కోసం పోరాడుతున్నాం. విజయవాడ ఎయిర్‌పోర్ట్‌లో 70 శాతం పనులు పూర్తయ్యేలా చేశాం. రాబోవు రోజుల్లో వారణాసి, అలహాబాద్‌కి ఫ్లైట్ కనెక్టివిటీ చేస్తున్నాం. కృష్ణా పుష్కరాల నిర్వహణకు ఇప్పటినుంచే సన్నద్ధమవుతున్నాం. కొండ ప్రాంతాల్లో నీటి సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతాం’ అని ఎంపీ కేశినేని చిన్ని హామీ ఇచ్చారు.

# గంటలోనే మారిన వెదర్.. హైదరాబాద్ వ్యాప్తంగా వర్షాలు.. ఈ ఏరియాల వాళ్లు జాగ్రత్త !



క్రాంతి న్యూస్: వానా కాలమా.. ఎండా కాలమా అన్న తేడా లేకుండా మంగళవారం వరకు ఎండలు దంచికొట్టాయి. ముందస్తుగా వచ్చిన రుతుపవనాలు ఎగిరిపోవడంతో వర్షాలు సెలవు తీసుకుని మళ్లీ వేసవిని తలపిస్తూ వచ్చింది వెదర్. అయితే ఇవాళ మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దట్టమైన మేఘాలతో హైదరాబాద్ నగరమంతా ఏ క్షణానైనా వర్షం కురవవచ్చు అనేలా కనిపించింది.

అనుకున్నట్లుగానే ఈదురుగాలులతో మొదలైన చిరుజల్లు.. మోస్తరు నుంచి భారీ వర్షాలుగా మారిపోయాయి. దాదాపు హైదరాబాద్ నగరం అంతా వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

పటాన్ చెరు, అమీన్ పూర్, బీరంగూడ, మియాపూర్, BHEL, చందానగర్, ప్రగతి నగర్, కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్, అల్వార్ మొదలైన ఏరియాలో చిరు జల్లులు కురుస్తున్నాయి. మరోవైపు బొల్లారం, యాప్రాల్, హకీంపేట్, మల్కాజ్ గిరి, తిరుమలగిరి, కాప్రాన్ ఏరియాల్లో వాన మొదలైంది.

పశ్చిమాన గచ్చిబౌలి, గోల్కొండ, మణికొండ, అత్తాపూర్, రాజేంద్ర నగర్, చంద్రాయణగుట్ట, చార్మినార్ పరిసర ప్రంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఇక బంజరాహిల్స్, జూబ్లీహిల్స్, కమాన్ ఏరియాల్లోనూ వర్షం కురుస్తోంది.

మరో రెండు గంటల్లో వర్షాలు మరింతగా పెరిగే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బయటకు వెళ్లే వారు కచ్చితంగా గొడుగు వెంట తీసుకెళ్లాల్సిందిగా సూచిస్తున్నారు. పైన పేర్కొన్న ఏరియావైపు వెళ్తున్న వాహనదారులు.. వాన నిలిచే వరకు ఎక్కడైనా తలదాచుకోవాలిని సూచించారు. వర్షా నిలిచాకే వెళ్లాలని హెచ్చరించారు అధికారులు.

# సున్నం చెరువు సరిహద్దుల్లో లే ఔట్ కలకలం



హైదరాబాద్ ,24 జూన్ (క్రాంతి న్యూస్): శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల సరిహద్దులో గుట్టల బేగంపేట, అల్లాపూర్ గ్రామాల మధ్య విస్తరించిన సున్నం చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ పరిధిలోనే సియెట్ లే ఔట్ ఉన్నదని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. చెరువు పరిరక్షణలో భాగంగా గతంలో హెచ్ఎండీఏ మంజూరు చేసిన డ్రాఫ్ట్ లేఔట్‌ను కూడా ఇదే కారణంగా రద్దు చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అలాగే, అదే ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన జీహెచ్ఎంసీ అనంతరం ఆ అనుమతులను రద్దు చేసుకున్నదని తెలిపారు.

ఈ నేపథ్యంలో "న్యాయం చేయాలి" అంటూ లేఔట్ ప్లాట్ల యజమానులు చేస్తున్న ఆందోళనకు ప్రామాణికత లేదని హైడ్రా అభిప్రాయపడింది. సున్నం చెరువు మొత్తం విస్తీర్ణం 32.60 ఎకరాలుగా ఉండగా, 1975లో సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసిన మ్యాపుల్లో కూడా ఇదే స్పష్టమైందని హైడ్రా పేర్కొంది. అంతేకాక, గ్రామ రికార్డుల్లోనూ ఇదే సమాచారం ఉందని, హైకోర్టు ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా ప్రత్యేక సర్వే నిర్వహించినట్లు తెలిపింది. అన్ని పక్షాల పరిశీలన అనంతరం చెరువు ఎఫ్‌టీఎల్‌లోనే లే ఔట్ ఉన్నట్టు తేలినదని వివరించింది.

చెరువు పరిధిలో ఆక్రమించిన నాలాలపై నిర్మాణాలు సహించరాదని, వాటిని తక్షణమే తొలగించాలన్న కోర్టు ఆదేశాలను మరోసారి గుర్తు చేసింది. ప్రస్తుతం లే ఔట్ పరిధిలో నిర్మాణాలు ప్రారంభం కాలేదని, ఖాళీగా ఉన్న ప్లాట్ల యజమానులు అర్హత ఉన్నట్లైతే నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. చివరగా, సున్నం చెరువు పునరుద్ధరణ పనులకు ఆటంకం కలిగించవద్దని హైడ్రా విజ్ఞప్తి చేసింది.

# చంద్రబాబును చర్చకు పిలవడం మన దురదృష్టకరం..



హైదరాబాద్ , 24 జూన్ (క్రాంతి న్యూస్):తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గోదావరి – కృష్ణ జలాల వినియోగానికి సంబంధించిన అంశంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. నీటి వాటా విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణకు నష్టం చేయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కీలక అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి చురుగ్గా స్పందించాల్సిన అవసరం ఉన్నా, నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో దీనిపై ఎలాంటి చర్చ జరగకపోవడం బాధాకరమన్నారు.

ఇప్పటికే కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ దోచుకున్న తీరును గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు అదే పరిస్థితి గోదావరి జలాలపై పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఒక్కటై గోదావరి జలాలను కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. బీజేపీ నేతలూ నిర్లక్ష్యంగా మాట్లాడకూడదని, కేంద్రంలో మంత్రి స్థాయిలో ఉన్న వారు కూడా వాస్తవ పరిణామాలు తెలుసుకోకుండా వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు.

గోదావరి–కావేరీ లింక్ అంశాన్ని గొడవగా మార్చి, తన ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకోవాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించిన జగదీష్ రెడ్డి, అపెక్స్ కమిటీ సమావేశం కోసమే ప్రయత్నించాలే తప్ప, చంద్రబాబుతో ప్రత్యక్ష సమావేశం అనే ఆలోచనే తప్పు అని అన్నారు. చంద్రబాబుతో చర్చలకు వెళ్లడం అంటే దాసోహంగా మారిపోయినట్టేనని, తెలంగాణ ప్రభుత్వాన్ని ఈ విషయంలో గట్టిగా స్పందించాలంటూ డిమాండ్ చేశారు.

కేసీఆర్ చేసిన సూచనలతో ఇప్పటి పరిస్థితులను పోల్చుతూ, అప్పట్లో కేసీఆర్ సముద్రంలో వృథాగా పోతున్న నీటిని రెండు రాష్ట్రాలు కలిసి ఎలా వినియోగించుకోవాలో ఆలోచించాలని లేఖ రాశారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం పూర్తిగా వక్రదిశలోనిదని, ఆయన లక్ష్యం తెలంగాణ ప్రజల హక్కులను పక్కదారి పట్టించడమేనన్నారు.

రైతుల సంక్షేమం పేరుతో ప్రభుత్వం చేస్తున్న సంబరాలపై కూడా జగదీష్ రెడ్డి కఠినంగా స్పందించారు. "రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసినందుకా సంబరాలు? రైతు భరోసా మూడు విడతలు వాయిదా వేసినందుకా సంబరాలు?" అని ప్రశ్నించారు. రైతులు అంటే కేవలం కొన్ని రాజకీయ నేతల కుటుంబాలేనా అని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు నమ్మి గెలిపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆంధ్ర ప్రయోజనాలను కాపాడేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

# ఇరాన్ నుంచి భారత్ చేరిన మరో 292 మంది



న్యూఢిల్లీ , 24 జూన్ (క్రాంతి న్యూస్):ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధంలో చిక్కుకుపోయిన భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' కొనసాగుతోంది. తాజాగా ఇరాన్ నుంచి మరో 292 మంది భారతీయులు న్యూఢిల్లీ చేరుకున్నారు. మసాద్ నుంచి వీరంతా ప్రత్యేక విమానంలో మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు న్యూఢిల్లీ విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకున్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు.

ఇరాన్ నుంచి ఇంతవరకూ 2,295 మంది భారతీయులను వెనక్కి తీసుకు వచ్చినట్టు జైశ్వాల్ చెప్పారు. వీరితో పాటు ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న 165 మంది భారతీయులను ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన సి–17 మిలటరీ రవాణా విమానంలో భారత్‌కు తీసుకువచ్చారు. ఢిల్లీ విమానాశ్రయంలో వీరిని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ రిసీవ్ చేసుకున్నారు.

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం అంతకంతకూ తీవ్రమవుతుండటంతో అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను వెనక్కు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గత వారంలో 'ఆపరేషన్ సింధు'ను చేపట్టింది. భారతీయులను తరలించేందుకు ఇరాన్ ప్రభుత్వం తమ గగనతలాన్ని తెరవడంతో అక్కడి భారతీయులను ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తరలిస్తున్నారు. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌పై ప్రతిదాడులు జరుపుతుండటంతో ఇజ్రాయెల్‌లోని భారతీయులనూ 'ఆపరేషన్ సింధు'తో వెనక్కి రప్పిస్తున్నారు.

# మోండా మార్కెట్ జ్యువెలరీ షాప్‌లో దోపిడీ కేసు.. ఛేదించిన పోలీసులు



సికింద్రాబాద్, 24 జూన్ (క్రాంతి న్యూస్):సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో ఇటీవల జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 18న మోండా మార్కెట్‌లో జ్యువెలరీ షాప్ యజమానిని ఓ ముఠా మోసం చేసి దోపిడీకి పాల్పడింది. బంగారం తక్కువ ధరకే ఇస్తామని నకిలీ బంగారం తీసుకొచ్చి రూ. 72లక్షలతో ఉడాయించారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ దోపిడీని పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నిందితుల్లో కొండాపూర్ 8వ బెటాలియన్‌కి చెందిన కానిస్టేబుల్ కేశవ్ పట్టుబడ్డాడు. ప్రధాన నిందితులు ఇద్దరిని గోవాలో అదుపులోకి తీసుకున్నారు. కేసుతో సంబంధం ఉన్న మరి కొంతమందిని కర్ణాటకలో అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం 18 మంది నిందితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేసిన డబ్బును నిందితులు వివిధ మార్గాల ద్వారా తరలించి పోలీసుల దృష్టి మరల్చే ప్రయత్నం చేశారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు నిందితుల్ని అరెస్ట్ చేశారు.

# స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి



హైదరాబాద్, 24 జూన్ (క్రాంతి న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే కృషి చేయాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన.. మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా.కె.లక్ష్మణ్‌తోపాటు రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్‌లు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తితో కార్యకర్తలు పనిచేయాలన్నారు.

అడిక్‌మెట్ డివిజన్‌లో ... బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

# పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు



హైదరాబాద్, 24 జూన్ (క్రాంతి న్యూస్): క్వారీ యజమానిని బెదిరించిన కేసులో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించింది. వరంగల్ కోర్టు ఇప్పటికే బెయిల్ ఇచ్చినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వివరించారు. సుబేదారీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఈ నెల 16న కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 17న విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను మంగళవారం వాయిదా వేసింది. ఆ లోపే 21న కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. వరంగల్ జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్‌ను తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ముగించింది.

# స్ట్రాబెర్రీలను అంత తేలిగ్గా తీసుకోకండి..
## వీటితో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు..!



హెల్త్ న్యూస్ ,24 జూన్ (క్రాంతి న్యూస్ ):స్ట్రాబెర్రీలను చాలా మంది తేలిగ్గా తీసుకుంటారు. కానీ వీటి వల్ల కలిగే ప్రయోజనాలు తెలిస్తే మాత్రం ఎవరూ వీటిని అంత సులభంగా విడిచిపెట్టరు. స్ట్రాబెర్రీలు రుచిగా ఉండడమే కాదు మనకు కావల్సిన అనేక పోషకాలను అందిస్తాయి. స్ట్రాబెర్రీలను పోషకాలకు నిలయంగా చెప్పవచ్చు. వీటిల్లో విటమిన్లు, మినరల్స్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవన్నీ మనకు ఎన్నో రకాలుగా ప్రయోజనాలను అందిస్తాయి. కనుక స్ట్రాబెర్రీలను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాల్సి ఉంటుంది. స్ట్రాబెర్రీలలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. రోజుకు ఒక కప్పు స్ట్రాబెర్రీలను తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో దాదాపుగా 98 శాతం వరకు లభిస్తుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. ఫ్రీ ర్యాడికల్స్ వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేందుకు సహాయం చేస్తుంది. దీంతో చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. గాయాలు, పుండ్లు త్వరగా మానిపోతాయి.

కొలెస్ట్రాల్‌కు చెక్..

స్ట్రాబెర్రీలు ఎరుపు రంగులో ఉండేందుకు కారణం వాటిల్లో ఉండే ఆంథో సయనిన్స్ అని చెప్పవచ్చు. ఆంథోసయనిన్స్ ఒక రకమైన యాంటీ ఆక్సిడెంట్ జాబితాకు చెందుతాయి. ఫ్లేవనాయిడ్స్ జాబితాకు ఇవి చెందుతాయి. అలాగే స్ట్రాబెర్రీలలో ఎల్లాజిక్ యాసిడ్ ఉంటుంది. క్వర్సెటిన్, పాలిఫినాల్స్ కూడా అధికంగానే ఉంటాయి. స్ట్రాబెర్రీలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని, శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులను తగ్గించడంలో సహాయం చేస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. స్ట్రాబెర్రీలలో ఉండే ఆంథో సయనిన్స్, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగు పరుస్తాయి. రక్తంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి.

గుండె ఆరోగ్యానికి..

స్ట్రాబెర్రీలలో ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. ఈ పండ్లలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు రక్త నాళాలు వాపులకు గురి కాకుండా చూస్తాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. తరచూ స్ట్రాబెర్రీలను ఆహారంలో భాగం చేసుకుంటే హార్ట్ స్ట్రోక్స్ వచ్చే ప్రమాదం చాలా తక్కువగా ఉంటుందని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. స్ట్రాబెర్రీలు రుచికి తియ్యగా ఉంటాయి. అయినప్పటికీ వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ తక్కువగా ఉంటుంది. పైగా ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. స్ట్రాబెర్రీలలో ఉండే పలు సమ్మేళనాలు ఇన్సులిన్‌ను శరీరం సక్రమంగా ఉపయోగించుకునేలా చేస్తాయి. కనుక స్ట్రాబెర్రీలను తింటే షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. డయాబెటిస్ అదుపులో ఉంటుంది.

జీర్ణ వ్యవస్థకు..

స్ట్రాబెర్రీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఒక కప్పు స్ట్రాబెర్రీలను తింటే సుమారుగా 3 గ్రాముల మేర ఫైబర్‌ను పొందవచ్చు. ఇది మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. ఈ పండ్లు ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. అందువల్ల ఈ పండ్లను తింటే జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. స్ట్రాబెర్రీలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ సమ్మేళనాలు మెదడు కణాలు డ్యామేజ్ అవకుండా చూస్తాయి. ఈ పండ్లలో ఉండే ఫ్లేవనాయిడ్స్ మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. తరచూ స్ట్రాబెర్రీలను ఆహారంలో భాగం చేసుకుంటే మెదడు యాక్టివ్‌గా ఉండడంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. నాడీ సంబంధ వ్యాధులు రాకుండా ఉంటాయి. ముఖ్యంగా వృద్ధాప్యంలో వచ్చే అల్జీమర్స్ రాకుండా చూసుకోవచ్చు. ఇలా స్ట్రాబెర్రీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# ఈ పండ్లు పోషకాలకు నిలయం అంటా
## కనిపిస్తే వదలకుండా తినండి



హెల్త్ న్యూస్ , 24 జూన్ (క్రాంతి న్యూస్ ):సూపర్ మార్కెట్లకు వెళ్లినప్పుడు లేదా పండ్ల దుకాణాల్లో మనకు అనేక రకాల పండ్లు దర్శనమిస్తుంటాయి. వాటిల్లో ప్రూన్స్ కూడా ఒకటి. ఇవి మనకు ఎక్కువగా డ్రై ఫ్రూట్స్ రూపంలో లభిస్తాయి. చూసేందుకు నల్లగా కిస్మిస్‌ల మాదిరిగా ఉంటాయి. కానీ సైజు కాస్త పెద్దవిగా ఉంటాయి. అయితే ఈ పండ్లను చాలా మంది చూసే ఉంటారు. కానీ ఇవి ఏమిటో చాలా మందికి తెలిసి ఉండదు. ఈ పండ్లను ప్రూన్స్ అంటారు. ప్లమ్స్‌ను ఎండబెట్టగా వచ్చే డ్రై ఫ్రూట్స్‌నే ప్రూన్స్ అంటారు. ఇవి పోషకాలకు నిలయంగా ఉంటాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రూన్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు కూడా చెబుతుంటారు. మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ప్రూన్స్‌లో ఉంటాయి. వీటిని రోజూ సాయంత్రం సమయంలో స్నాక్స్ రూపంలో తినవచ్చు. ఎన్నో లాభాలను పొందవచ్చు.

మలబద్దకం ఉండదు..

ప్రూన్స్‌లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. సాల్యుబుల్, ఇన్‌సాల్యుబుల్ ఫైబర్ రెండు రకాలు ఇందులో ఉంటాయి. ఇవి పేగుల్లో మలం కదలికలను సులభతరం చేస్తాయి. దీంతో మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ శక్తి మెరుగు పడుతుంది. ప్రూన్స్‌లో సహజసిద్ధమైన షుగర్ ఆల్కహాల్ అయిన సార్బిటాల్ అధికంగా ఉంటుంది. ఇది మైల్డ్ లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. అంటే సుఖ విరేచనం అయ్యేలా చేస్తుందన్నమాట. ప్రూన్స్‌ను తింటే మలబద్దకం అన్న సమస్యే ఉండదు. ప్రూన్స్‌లో ఉండే పాలిఫినాల్స్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ పండ్లలో విటమిన్ కె అధికంగా ఉంటుంది. అలాగే పొటాషియం, బోరాన్, మాంగనీస్ కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి ఎముకలను బలంగా మారుస్తాయి. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కునేలా చేస్తాయి. 40 ఏళ్లకు పైబడిన వారు ప్రూన్స్‌ను తరచూ తింటుంటే ఎముకలు విరిగిపోకుండా దృఢంగా ఉంటాయి.

గుండె ఆరోగ్యానికి..

ప్రూన్స్‌లో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో నియోక్లోరోజెనిక్, క్లోరోజెనిక్ యాసిడ్లు, ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే ఫ్రీ ర్యాడికల్స్‌పై పోరాటం చేస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులను తగ్గిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టాన్ని నివారించవచ్చు. దీని వల్ల గుండె జబ్బులు, పలు రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. వయస్సు మీద పడడం వల్ల వచ్చే వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ప్రూన్స్‌లో అధికంగా ఉండే సాల్యుబుల్ ఫైబర్ మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతుంది. ఈ పండ్లలో ఉండే పొటాషియం బీపీని తగ్గిస్తుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ స్ట్రోక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

డయాబెటిస్ ఉన్నా కూడా..

ప్రూన్స్ తినేందుకు తియ్యగా ఉన్నప్పటికీ ఇవి చాలా తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువను కలిగి ఉంటాయి. అందువల్ల ప్రూన్స్‌ను తింటే షుగర్ లెవల్స్ పెరగవు. పైగా ప్రూన్స్‌లో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ పండ్లను నిరభ్యంతరంగా తినవచ్చు. దీంతో షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. ప్రూన్స్‌లో అధికంగా ఉండే ఫైబర్ వల్ల ఈ పండ్లను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇలా ప్రూన్స్‌తో మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. డైటిషియన్లు చెబుతున్న ప్రకారం రోజుకు 4 నుంచి 6 ప్రూన్స్‌ను తింటున్నా చాలు ఎన్నో లాభాలు కలుగుతాయని అంటున్నారు.

# ఎముకపుష్టికి ఎండుఖర్జూరం పాలు తాగితే...



హెల్త్ న్యూస్ ,24 జూన్ (క్రాంతి న్యూస్ ): ఎండు ఖర్జూరాలు. వీటిలో ఎన్నో పోషకాలున్నాయి. ఇది చర్మాన్ని బిగుతుగా కాంతివంతంగా మారుస్తుంది. కేశాలను దృఢంగా మార్చి నిగనిగలాడేట్లు చేస్తుంది. ఇది మెరుగైన రక్త ప్రసరణను ప్రోత్సహించి రక్తహీనతను నివారిస్తుంది. ఇంకా ఏమేమి ఉపయోగాలున్నాయో తెలుసుకుందాము.ఖర్జూరం పాలు తాగుతుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే దీన్ని పవర్ బూస్టర్ అంటారు.ఖర్జూరం పాలకు చర్మాన్ని కాంతివంతం చేసే శక్తి వుంది.రక్తంలో హిమోగ్లోబిన్‌ను పెంచి ఆరోగ్యవంతం చేస్తుంది. రక్తపోటును నియంత్రించి అద్భుత శక్తినిస్తుంది.ఇది దంతాలు, ఎముకలకు మేలు చేస్తుంది.కంటిచూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

# 'అతడిని ఎందుకు తీసుకున్నారు.. నితీశ్ రెడ్డి వంద రెట్లు బెటర్'



స్పోర్ట్స్ న్యూస్ , 24 జూన్ (క్రాంతి న్యూస్ ): ఠాకూర్ దారుణ ప్రదర్శన కనబరిచాడు. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి స్థానంలో తుది జట్టులోకి వచ్చిన శార్ధూల్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం ఒకే ఒక్క పరుగు చేసిన ఠాకూర్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే తీరును కనబరిచాడు. జోష్ టంగ్ బౌలింగ్‌లో చెత్త షాట్ ఆడి తన వికెట్‌ను సమర్పించుకున్నాడు. ఈ ముంబై క్రికెటర్ 4 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరాడు. బౌలింగ్‌లోనూ విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లు వేసి 38 పరుగులు సమర్పించుకున్నాడు.

దీంతో భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మరో స్పెల్ బౌలింగ్ చేసే అవకాశమివ్వలేదు. అయితే ఈ మ్యాచ్‌లో శార్ధూల్ ఠాకూర్‌పై టీమిండియా మెనేజ్‌మెంట్ భారీ అంచనాలు పెట్టుకుంది. లోయార్డర్‌లో శార్ధూల్ తన అనుభవంతో పరుగులు సాధిస్తాడని భావించింది. అందుకే ఆసీస్ గడ్డపై దుమ్ములేపిన తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డిని పక్కనపెట్టి మరీ శార్దూల్‌ను ఆడించారు.

కానీ హెడ్ కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ గిల్ నమ్మకాన్ని శార్ధూల్ వమ్ము చేశాడు. ఈ క్రమంలో టీమ్‌మెనెజ్‌మెంట్‌పై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నాడు. శార్ధూల్‌ను ఎందుకు అవకాశమిచ్చారు.. అతడి కంటే నితీశ్ రెడ్డి వంద రెట్లు బెటర్ అని పోస్ట్‌లు పెడుతున్నారు.

మరోవైపు శార్దూల్‌కు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 6 ఓవర్ల మాత్రమే బౌలింగ్ ఇవ్వడాన్ని పలువురు మాజీలు తప్పుబడుతున్నారు. అతడిపై మీకు నమ్మకం లేనప్పుడు జట్టులోకి ఎందుకు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

# శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్‌దే విజయం!



స్పోర్ట్స్ న్యూస్ ,24 జూన్ (క్రాంతి న్యూస్ ):మేజర్ లీగ్ క్రికెట్ 2025లో భాగంగా డల్లాస్‌లోని గ్రాండ్ ప్రైరీ స్టేడియం వేదికగా ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో శాన్‌ఫ్రాన్సిస్కో జట్టు 47 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ ప్రారంభించిన శాన్‌ఫ్రాన్సిస్కో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసింది. బ్యాటర్లలో మ్యాథ్యూ షార్ట్ (91), జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (64) రాణించాడు. ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ బౌలర్లలో పొలార్డ్ 2, నవీన్ ఉల్ హక్ నోస్తూష్ కెన్జిగే చెరో వికెట్ తీసుకున్నారు.

247 పరుగుల విజయలక్ష్యంతో తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి కేవలం 199 రన్స్ మాత్రమే చేయగలిగింది. దీంతో శాన్‌ఫ్రాన్సిస్కో జట్టు 47 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముంబయి ఇండియన్స్ న్యూయార్క్ బ్యాటర్లలో క్వింటన్ డికాక్ (70), మొనాక్ పటేల్ (60) రాణించారు. శాన్‌ఫ్రాన్సిస్కో బౌలర్లలో జేవియర్ బార్ట్‌లెట్ , రొమారియో షెఫర్డ్ చెరో రెండు, హారీస్ రవూఫ్, లియామ్ ప్లంకెట్ చెరో వికెట్ తీసుకున్నారు.

# అంతర్జాతీయ హాకీకి లలిత్ వీడ్కోలు



స్పోర్ట్స్ న్యూస్ ,24 జూన్ (క్రాంతి న్యూస్ ): రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత లలిత్ ఉపాధ్యాయ అంతర్జాతీయ హాకీకి వీడ్కోలు పలికాడు. 2014 ప్రపంచకప్‌లో అరంగేట్రం చేసిన ఈ ఫార్వర్డ్.. 2020 టోక్యో, 2024 పారిస్ ఒలింపిక్స్ కాంస్యం గెలిచిన భారత జట్టులో సభ్యుడు. ఐరోపా ప్రొ హాకీ లీగ్‌లో ఆదివారం బెల్జియంతో మ్యాచ్ ముగిసిన అనంతరం లలిత్ వీడ్కోలు గురించి వెల్లడించాడు. "చిన్న గ్రామం నుంచి నా ప్రయాణం మొదలైంది. ఒలింపిక్ పోడియంపై నిలవడాన్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటా. భారత్ విజయాల్లో నా వంతు పాత్ర పోషించడం ఎంతో గర్వంగా ఉంది" అని లలిత్ చెప్పాడు. జూన్ 15న ఆస్ట్రేలియాతో ఆడిన మ్యాచే లలిత్ కెరీర్‌లో చివరిది. మొత్తంగా 183 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అతడు 67 గోల్స్ కొట్టాడు. 2016 ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ, 2017 ఆసియాకప్‌లో నాలుగేసి గోల్స్‌తో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. 2017 హాకీ ప్రపంచ లీగ్ ఫైనల్ టోర్నీలో కాంస్యం, 2018 ఛాంపియన్స్ ట్రోఫీలో రజతం, 2018 ఆసియా క్రీడల్లో కాంస్యం, 2018 ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో స్వర్ణం లలిత్ ఖాతాలో ఉన్నాయి. 2022 ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులోనూ లలిత్ సభ్యుడే. హాకీలో సేవలకు గుర్తింపుగా 2021లో అతడికి అర్జున అవార్డు దక్కింది.

# ఆసియా కప్ నుంచి పాకిస్తాన్ ఔట్.. ? వైరలవుతున్న సోనీ స్పోర్ట్స్ పోస్టర్

స్పోర్ట్స్ న్యూస్ ,24 జూన్ (క్రాంతి న్యూస్ ): ఈ ఏడాది చివర్లో భారత్‌లో జరగాల్సిన ఆసియా కప్–2025 కోసం టోర్నీ అధికారిక ప్రసారదారు సోనీ స్పోర్ట్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక టీ20 జట్లకు చెందిన కెప్టెన్లు సూర్యకుమార్ యాదవ్, నజ్ముల్ శాంటో, చరిత్ అసలంక మాత్రమే ఉన్నారు. ఈ పోస్టర్‌లో పాకిస్తాన్‌కు ప్రాతినిథ్యం లేకపోవడం? సోషల్‌మీడియాలో చర్చలకు తావిచ్చింది. ఆసియా కప్ నుంచి పాక్ వైదొలిగిందని ప్రచారం మొదలైంది.




పహల్గాం ఉదంతం, తదనంతర పరిణామాల్లో (ఆపరేషన్ సిందూర్) భారత్, పాక్ మధ్య అప్పటివరకు ఉన్న తేలికపాటి సంబంధాలు కూడా తెగిపోయిన విషయం తెలిసిందే. క్రీడలు సహా అన్ని అంశాల్లో భారత్ పాక్‌తో సంబంధాలు తెంచుకుంది. క్రికెట్‌కు సంబంధించి ఆసియా కప్, ఐసీసీ టోర్నీల్లో, అదీ తటస్థ వేదికల్లో మాత్రమే భారత్ పాక్‌తో మ్యాచ్‌లు ఆడే విషయం పరిశీలనలో ఉంది. వాస్తవానికి క్రికెట్‌లో కూడా భారత్ పాక్‌తో పూర్తి స్థాయి సంబంధాలు తెంచుకోవాలని భారతీయుల నుంచి ఒత్తిడి ఉంది.

ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా పాకిస్తాన్‌కు చెందిన మంత్రి, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహిసిన్ నఖ్వీ ఉండటంతో భారత్ ఆసియా కప్ నుంచి కూడా వైదొలుగుతుందని పలు నివేదికలు తెలిపాయి.

మరికొన్ని నివేదికలేమో భారత్ తమ దేశ క్రికెట్ బోర్డు (బీసీసీఐ) పరపతిని ఉపయోగించి పాకిస్తాన్‌నే ఆసియా కప్ నుంచి వైదొలిగేలా చేస్తుందని చెప్పాయి. తాజాగా సోనీ? స్పోర్ట్స్ పాక్ ప్రాతినిథ్యం లేని పోస్టర్‌ను విడుదల చేయడంతో ఇదే నిజమైదేంమోనని అనిపిస్తుంది. మొత్తానికి సోనీ? స్పోర్ట్స్ విడుదల చేసిన ఆసియా కప్ పోస్టర్ భారత్, పాక్‌ల మధ్య మరోసారి అగ్గి రాజేసేలా ఉంది.

కాగా, ఆసియా కప్ 2025పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ టోర్నీ యొక్క ఖచ్చితమైన వివరాలు, వేదికలు, షెడ్యూల్ గురించి ఏసీసీ ఎలాంటి సమాచారం ఇవ్వ లేదు. ఏసీసీ అధ్యక్షుడిగా పాక్‌కు చెందిన వ్యక్తి ఉన్నా, తమ దేశ భాగస్వామ్యంపై ఇప్పటివరకు స్పందించలేదు. కొద్ది రోజుల కిందట టోర్నీని భారత్‌లో కాకుండా యూఏఈలో నిర్వహిస్తారని కూడా ప్రచారం జరిగింది.

**2031 వరకు ఏసీసీ ఈవెంట్స్ హక్కులను దక్కించుకున్న సోనీ స్పోర్ట్స్**

సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా (SPNI) 2024 నుండి 2031 వరకు అన్ని ఏసీసీ టోర్నమెంట్‌ల మీడియా హక్కులను $170 మిలియన్ల బేస్ ధరకు దక్కించుకుంది. ఇది మునుపటి సైకిల్ కంటే 70% ఎక్కువ. ఆశ్చర్యకరంగా మీడియా హక్కుల కోసం పోటీ బిడ్డింగ్ జరగలేదు. జియోస్టార్ మధ్యలో వైదొలిగింది.

# లెక్కలేనన్ని అభినందనలు



థియేటర్‌లో సినిమా చూసుకున్నప్పుడు గ్రేట్‌గా అనిపించింది. నా క్యారెక్టర్‌కి అద్భుతమైన స్పందన వస్తున్నది. కాంప్లిమెంట్స్ అయితే.. ఇక లెక్కే లేదు. ముఖ్యంగా ఫైట్ సీక్వెన్స్ గురించి అందరూ మాట్లాడుతున్నారు. నా వ్యక్తిగత జీవితానికి బాగా కనెక్టయిన పాత్ర ఇది. ఇంతమంచి పాత్రను నాతో చేయించిన దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టికీ, మైత్రీ మూవీమేకర్స్ వారికీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా.’ అని అనంతిక సనీల్‌కుమార్ అన్నారు.

ఆమె లీడ్ రోల్ చేసిన సినిమా ‘8 వసంతాలు’. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో అనంతిక మాట్లాడారు. ఈ సినిమాలో అవకాశం ఇచ్చినందుకుగాను దర్శకనిర్మాతలకు హీరోలు హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకా డీఓపీ విశ్వనాథరెడ్డి, నటీనటులు కన్నా, సంజన, కిరణ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నాగ చైతన్య 25వ సినిమాకు దర్శకుడు ఫిక్స్


నాగ చైతన్య హీరోగా సమంత హీరోయిన్ గా వచ్చిన సూపర్ హిట్ సినిమాలలో ‘మజిలీ’ కి ప్రత్యేక స్థానం ఉంది. యంగ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. చైతన్య కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచిన ఈ సినిమా ఆన్ స్క్రీన్ నాగ చైతన్య-సమంత భార్య భర్తలుగా కలిసి నటించిన చివరి సినిమా కూడా.





అయితే ఇప్పుడు మరోసారి మజిలీ దర్శకుడితో నాగ చైతన్య సినిమా రాబోతుంది. దర్శకుడు శివ నిర్వాణ ఇటీవల నాగ చైతన్యను కలిసి ఓ కథ చెప్పాడం జరిగింది. పాయింట్ బాగా నచ్చడంతో శివకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేసాడు చై. దర్శకుడు శివ నిర్వాణ ప్రస్తుతం డైలాగ్ వెర్షన్ ను రెడీ చేసే పనిలో ఉన్నాడు. త్వరలో ఈ సినిమాకు సంబందించి అధికారిక ప్రకటన రాబోతుంది. నాగ చైత్యన్య కెరీర్ లో మైల్ స్టోన్ 25వ సినిమాగా రాబోయే ఈ సినిమా ఫీల్-గుడ్ ఎమోషనల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రాబోతున్నట్టు సమాచారం. టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. టక్ జగదీష్, ఖుషి వంటి బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్స్ ఇచ్చిన శివ నిర్వాణ నాగ చైతన్యతో సినిమాతో సూపర్ హిట్ కొట్టాలని తీవ్రంగా కసరత్తులు చేస్తున్నాడు. అటు చైతన్య కూడా విరూపాక్ష దర్శకుడితో చేస్తున్న సినిమా ఫినిష్ చేసి శివ నిర్వాణసినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నాడు.

## అల్లు అర్జున్ ‘ఐకాన్’ లేనట్లే : దిల్ రాజు




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానులను చాలా కాలంగా ఊరిస్తూ వస్తున్న చిత్రం ‘ఐకాన్. పుష్ప సినిమాకు ముందు ఈ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్ట్ అల్లు అర్జున్‌తో రద్దయినట్లు నిర్మాత దిల్ రాజు ప్రకటించాడు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌తో వేరే హీరోతో ముందుకు వెళుందని ఆయన వెల్లడించారు.‘వకీల్ సాబ్’ దర్శకుడు వేణు శ్రీరామ్ అల్లు అర్జున్ కోసం ‘ఐకాన్’ కథను సిద్ధం చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి అధికారికంగా ఒక పోస్టర్‌ను కూడా వదిలారు.ఔ అయితే, ‘పుష్ప’ సినిమాతో అల్లు అర్జున్ బిజీ కావడంతో, ఈ ప్రాజెక్టు ఆలస్యమవుతూ వచ్చింది. ఈ మధ్యలో వేణు శ్రీరామ్ నానితో ‘తమ్ముడు’ అనే మరో కథను సిద్ధం చేసుకున్నారు. అయితే పుష్ప సినిమాతో అల్లు అర్జున్‌కి వచ్చిన క్రేజ్ కారణంగా ఐకాన్ చిత్రం అల్లు అర్జున్ సెట్ కాదని మేకర్స్ ఆలోచించినట్లు సమాచారం.

ఇదే విషయంపై దిల్ రాజు మాట్లాడుతూ.. అల్లు అర్జున్ ప్రస్తుతం ఉన్న బిజీ షెడ్యూల్ కారణంగా ‘ఐకాన్’ సినిమా చేసే అవకాశం లేదు. అందుకే ఈ మూవీ కోసం వేరే హీరోని తీసుకునే ఆలోచనలో ఉన్నాం. ‘తమ్ముడు’ విడుదలైన తర్వాత వేణు శ్రీరామ్ ‘ఐకాన్’ స్క్రిప్ట్‌ను ముందుకు తీసుకెళ్తారు. ఇది యూనివర్సల్ స్క్రిప్ట్. హ్యూమన్ ఎమోషన్స్‌తో కూడిన ఒక యాక్షన్ ఫిలిం ఇది” అని వెల్లడించారు.

## చిన్న విషయాలే కావచ్చు.. జీవితమంతా గుర్తుంటాయి : రష్మిక



‘కుబేర’తో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు రష్మిక శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సమీరా పాత్రలో తన నటనతో ఆకట్టుకున్నారామె. తాజాగా ఈ చిత్రంలో తన కోస్టార్ ధనుష్‌పై ఆమె ప్రశంసలు కురిపించారు. ఆయన సింప్లిసిటీని గురించి వివరిస్తూ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.“మీతో అంత పెద్ద సినిమా చేసినప్పటికీ మనిద్దరిది ఒక్క సెల్ఫీ మాత్రమే ఉంది. మీరు అద్భుతమైన వ్యక్తి. మనం మట్లాడుకున్న ప్రతిసారీ వేర్వేరు నగరాల్లో ఉన్నాం. ఇద్దరం వేర్వేరు పనులు చేసుకుంటూ మాట్లాడుకునేవాళ్లం. విశ్రాంతి ఎంత ముఖ్యమో చర్చించేవాళ్లం. కానీ, విశ్రాంతి మాత్రం తీసుకోలేదు. కుబేర నటనపరంగానే కాదు.. నిజ జీవితంలోనూ మీరు చేసే పనులు ఎంతోమందికి ఆదర్శం. చుట్టూ ఉన్నవారితోనూ ఎంతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటారు. ముఖ్యంగా మీరు సెట్‌లో నాకోసం తెచ్చిన లడ్డూలను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. నాకు తమిళ డైలాగుల్లో మీరు చేసిన సాయం.. నేను ఏదైనా డైలాగు చెప్పినప్పుడు మీరు ప్రశంసించిన తీరు. ఇవన్నీ చిన్నచిన్న విషయాలే కావచ్చు.. కానీ, జీవితమంతా గుర్తుంటాయి” అంటూ ధనుష్‌తో దిగిన సెల్ఫీని షేర్ చేశారు.ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన క్రైమ్ డ్రామా ‘కుబేర’. ధనవంతుల అత్యాశకు, పేదవాళ్ల ఆకలికి మధ్య జరిగే సంఘర్షణకు దృశ్య రూపంగా ప్రేక్షకుల ముందుకువచ్చి విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com